


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

20

(అక్టోబర్ 8,'65, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**బంగారం నగలమీద నిషేధం తొలగించిననాడే** మా బావమరిదికి ఆడపిల్ల పుట్టింది. ఆయనకూడా ఆంధ్రప్రభలోనే పని చేస్తుంటంవల్ల, పేపరు చేతపట్టుకుని ఇంటికి వెళ్ళాడట.

అంతకు ముందే ఇంట్లో వారంతా "తొలుచూరు ఆడపిల్ల పుట్టింది అంటే లక్ష్మి అన్నమాట. సిరికోసం వెతుక్కో అక్కర్లేదన్నమాట. సౌభాగ్యలక్ష్మి, ధనలక్ష్మి, గజలక్ష్మి, వరలక్ష్మి, " అంటూ పొగుడుతున్నారట.

మా బావమరిది తీసుకువెళ్ళిన పత్రిక చదివి "ఇంకేం? అనంత లక్ష్మి పుట్టినరోజునే ఆభరణాల మీద నిషేదం తొలిగించారు. ఆలస్యం చేయకుండా వెళ్ళి - మెళ్ళోకో చిన్నగొలుసు, చేతులకు వత్తులూ ఆర్డరివ్వండి. పురిటి నీళ్ళనాటికి వస్తాయి' అని అందరూ అనడం ప్రారంభించారట.

***<u>ఇప్పుడెక్కడ, ఎప్పుడో చూద్దాం..</u>***

మా బావమరిది - "అప్పుడే ఎక్కడ! - ఎప్పుడో చూద్దాం. అప్పు దొరకొద్దూ! అదను కుదరొద్దూ. " అంటూ గిరిగిరా తిరగడం ప్రారంభించాడట. పత్రిక పట్టుకు వెళ్ళినందుకు చింతా క్రాంతుడవడం కూడా జరిగిందిట.

చివరికేమీ తోచక బోనస్ వచ్చిన తర్వాత చేయిస్తానన్నాడట. ఎవరూ ఒప్పుకోలేదు. ఇహ లాభం లేదని వెళ్ళి వాటికి ఆర్డరిచ్చాడు. తీరా ఇచ్చిన తర్వాత - ప్రతిరోజూ సైకిల్ మీద వెళ్ళి ఎప్పుడిస్తారని అడిగివస్తున్నాడు. బారసాల నాటికి పిల్లవంటి మీద బంగారం మెరిసిపోవాలని తన కళ్ళవెంట ఆనంద బాష్పాలు కురిసిపోవాలని.

పధ్నాలుగు కారెట్ల బంగారం కొద్ది కాలమే ప్రచారంలో ఉన్నా - దాన్ని గురించి తమాషాలు, తగాదాలు, ఉపమానాలు, ఉడుకుబోతుతనాలు అనేకం బయలుదేరాయి.

హైదరాబాదులో ఉండగా - మా ఇంటికి కొంచెం దూరంలో - ఒక అరవ ఇల్లలుండేది. ఆవిడ ఒక రోజున, ప్రక్క ఇంటి ఆవిడతో నగల్ని గురించి మాట్లాడుతోంది.

"పధ్నాలుగు కారెట్లు పసందు ఇల్లే అమ్మ.. ఒరుమాదిరిగా ఇరికిదు.. మెడలో ఉన్నా సిరికిరి ఇల్లే ( చిరునవ్వులేదు పెదవులపైన) - ఎన్న ప్రయోజనం?"

ప్రక్కింటావిడ అంటోంది - 'పైగా అవి వంటికి పడలేదు మామీ! మా బంధువుల్లో ఒకావిడ గొలుసు కొనివేసుకుంది. పదిహేను రోజుల్లో మెడచుట్టూ పచ్చబొట్టు పొడిపించుకున్నట్లు మచ్చపడింది.'

*ద్రాహకం - ద్రేహానికి పడదు*

"ఆమా..ఆమా.. అదినిండా సత్తెం.. అందులో ద్రాహకం ఉండేది. అది ద్రేహానికి పడదు. చర్మానికి తగిలితే, అది మాదిరిగా మారిపోను' అన్నది అరవ ఇల్లాలు.

"మచ్చపడటమే, కాదుట. అంతవరకూ ఒకటే దురదట - పైగా సన్న సన్నని పొక్కులు కూడా లేచుకు వచ్చాయట. పాపం. అని వేసుకున్న వాళ్ళు వాటితో నానా అవస్థాపడి తీసి పెట్టెలో పారేశారట."

"రొంబ కష్టం. రొంబకష్టం. వేరొన్ను విషయం - పధ్నాలుగు కారెట్టు పురుష హృదయం మాదిరిగా ఫెళుసుగా ఇరికింది. మెత్తదనమే ఇల్లియే" అన్నదామె.

ఆభరణాలకు పనికిరాదని చెప్పడంతో వదిలి పెట్టకుండా పురుష హృదయంతో కూడా పోల్చిందామె.

మొన్న ఒక పెళ్ళిలో ఇద్దరు వ్యక్తులు వీధిలోకి వచ్చి సిగరెట్లు కాలుస్తూ - నూతన దంపతుల్ని గురించి మాట్లాడుతూ - 'ఆ పిల్ల ముందు వాడెక్కడ. ఒకటి 24 కారెట్లు, ఒకటి పధ్నాలుగూ' అన్నాడొకాయన.

'పధ్నాలుగు కూడా ఎక్కడ! ఇంకో నాలుగు తగ్గించు. పుత్తడి దగ్గిర ఇత్తడిలాగా ఉంది. అయినా కర్మలెవరు తప్పిస్తారు? పాపం, ఆ అమ్మాయికి యావజ్జీవ కఠినశిక్ష' - అన్నాడు.

"ఎప్పుడైనా పురుళ్ళకు పుట్టింటికి పంపితే పెరోల్ మీద వదిలినట్లు వదులుతారు - అదిలేనిచోట్లూ ఉన్నాయి" అన్నాడింకో ఆయన.

*పప్పుగిన్నె చెడగొట్టి గొలుసు*

పధ్నాలుగు కారెట్ల మీద నిజానికి చాలా మందికి మనసులేదు. భర్త ఒకవేళ 'ఏమే! పోనీ, కొంచెం చవకగా వస్తాయి - ఆ పధ్నాలుగు కారెట్లని - కొన్ని నగలు చేయించుకుంటావేమిటి' అంటే భార్య వెంటనే 'అవెందుకు. పోనీ ఆ పప్పుగిన్నె తీసుకుపోయి, నాలుగు పేట్ల గొలుసు చేయించండి - ఆ అర్ధశేరు వుడికేది తీసుకుపోయి - వడ్డాణం చేయించండి - రోజు పొద్దున్నే అంట్లతో పాటు తోమడానికైనా వీలవుతుంది' - అనడం జరిగేది. 'అలా అంటావేమిటే! దాంట్లో మాత్రం బంగారంలేదు. పాళ్ళు తక్కువగాని' అని ఆయన అంటే -

'మా అమ్మమ్మ అంటూ ఉండేది. స్వంత కొంపలోనన్నావుండాలి గాని, మధ్య త్రిశంకు స్వర్గాలల్లే ఈ అద్దెకొంపలేమిటి. అలాగే మళ్ళీ మధ్య ఈ పధ్నాలుగు కారెట్ల బాజాలెందుకండీ' అనడం కద్దు.

కంట్రోలు అమలులోకి వచ్చిన తరవాత బంగారం వాడకం తగ్గించుకోవాలని చాలా ప్రచారం జరిగింది. బంగారానికి బదులు ఇతర లోహాల నగలు ధరించమని కూడా ప్రభుత్వం సలహా ఇచ్చింది.

ఇవ్వడమేమిటి - వివిధ రాష్ట్రాలలో గ్రామాలలో స్త్రీలు ధరించే నగలు తెచ్చి ఊరూరా ప్రదర్శనలిచ్చారు. హైదరాబాదులో కూడా ప్రదర్శనం జరిగినప్పుడు - చాలామంది ఆ నగలు తెచ్చి భార్యలకు కానుకలుగా ఇచ్చారు.

ఏ దుద్దులో, ఉంగరాలో తప్ప, అరవీశెకు తక్కువ బరువుగల ఆభరణం ఒక్కటీ లేదు. మేమున్నచోట - ఒకావిడ రాజస్థాన్ నగలు తెస్తే - ఒకామె గుజరాత్ నగలు తెచ్చింది. స్వయంగా వెళ్ళి.

*పనిమనిషి మారిందా!*

మర్నాడు అవన్నీ ధరించి ఇంట్లో తిరుగుతుంటే - 'క్రొత్త పనిమనిషిని పెట్టారల్లే ఉందే? ' - అని అడిగారట ప్రక్క ఇంటి ఆయన.

'క్రొత్త పనిమనిషి కాదండీ - గుజరాత్ నగలు. అదేదో లోహానివి - అమ్ముతున్నారట ఊళ్ళో' - అందిట భార్య.

'ఓహో గుజరాత్ నగలా! ఆ ఇంటియజమాని ఒక మురళి కూడా కొనుక్కుంటే బాగుండును. ఇల్లు గోకులం అవుతుంది' అన్నాడాయన.

ఇరవై నాలుగుకారెట్ల మీద నిషేధం ఉన్న రోజుల్లో ఎవరన్నా మేలిమి బంగారం ఎలాగో అలా సంపాదించి నగలు చేయించుకొన్నా - మేలిమి అని చెప్పేవారు కాదు. 'అబ్బే! పద్నాలుగే? అంత భాగ్యం కూడానా!' అని -

'మాపాసా' వ్రాసిన 'నెకొలెస్' కథలో నాయికలాగా అబద్దలాడుతూనే ఉండేవారు. 'నిధి చేతిలో ఉండి, ఉన్నదని చెప్పుకొనే యోగ్యత లేని జీవులు' కొందరుంటారు. శాపాల్లో ఇదో రకం.

***ఏ రంప పోలవరమో పోదాం.***

మేలిమి బంగారం దొరక్క - పద్నాలుగు కారెట్లకు భార్య అంగీకరించక బాధపడే ఒక గృహస్థు - ' ఈ బాధంతా దేనికే! రోజూ ఒక పావలా మల్లెపువ్వులు తెస్తాను. తల్లో, మెళ్ళో, ముంజేతులకు, దండలకు కట్టి ధరించు. అపర శకుంతలలాగా ఉంటావు' అన్నాడట.

"అలా అయితే, పదండి ఈ ఉద్యోగం వదిలి పెట్టి, ఏ రంప పోలవరమో వెళ్ళి - ఒక చిన్న పర్ణశాల వేసుకుందాం. కందమూలాలు తిందాం. బస్తీలో అలా కట్టుకు తిరిగితే ఏ సినిమా వాళ్ళో వచ్చి పట్టుకు పోతారు" అందిట.

Comment on this article..